క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

పాలకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలింపు, సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి శుక్రవారం పాలకొండ ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ సీఐ ఎంవీ గోపాలకృష్ణ గురువారం స్థానిక విలేకరులకు ఈ విషయం తెలిపారు. ఎస్‌ఈబీ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు 14 ద్విచక్ర వాహనాలతో పాటు 3 ఆటోలు, బొలెరో పికప్ వాహనం వేలంలో పెడుతున్నట్లు తెలిపారు. నేటి ఉదయం 11 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ కళావతి

సీతంపేట: సీతంపేట శివాలయం వద్ద గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఎ.కళావతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రజలు ఈ వేసవి కాలంలో నీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుదర్శనరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఘనసర



విజేత ఘనసర జట్టుకు బహుమతి అందిస్తున్న కొత్తకోట భారతమ్మ, ఎంపీటీసీ చంద్రశేఖర్

భామిని: మండలంలోని సొలికిరిలో నిర్వహించిన కొత్తకోట నవీన్ స్మారక మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు గురువారం ముగిసింది. టోర్నీ విజేతగా ఘనసర జట్టు నిలిచింది. సొలికిరి జట్టు రన్నర్‌గా నిలిచింది. దివంగత చార్టెడ్ అకౌంటెంట్ కొత్తకోట నవీన్ తల్లి కొత్తకోట భారతమ్మ, సర్పంచ్ జామి ప్రభాకర్ బహుమతులను అందజేశారు. జేసీఎస్ మండల కోఆర్డినేటర్, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ జి.రమేష్, డైరెక్టర్ కె.ఆంజనేయుడు, రొక్కం రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉషారాణి, బోదెపు శ్రీనివాసరావు

భామిని: క్రీడలతో ఆరోగ్యంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గెల్లంకి గోపాలదాస్ అన్నారు. మండలంలోని వడ్డంగిలో గురువారం వడ్డంగి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు యువతకు ఆరోగ్యంతో పాటు స్నేహభావం పెంపొందిస్తాయన్నారు. పోటీల్లో ఆంధ్రా, ఒడిసా నుంచి 40 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

గరుగుబిల్లి: కార్యాలయానికి వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్.గోపాలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామ సచివాలయాల పరిధిలో చలవేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వేసవి ఎండలు కారణంగా ఏ ఒక్కరూ అవస్థలు పడకుండా ఉండేలా చలివేంద్రాలను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అర్జున్‌రావు, నాయుకులు జి.శ్రీనివాసరావు, బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్

బలిజిపేట: 'ప్రైవేట్ కళాశాల వద్దు – ప్రభుత్వ కళాశాలే ముద్దు' అనే నినాదంతో బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపక బృందం గురువారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు గతంలో వెళ్లి పదవ తరగతి విద్యార్థులకు తెలియపరిచారు. ప్రస్తుతం గ్రామాల్లో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నేరుగా కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతున్నారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ లబ్ధి

● ఎమ్మెల్యే కళావతి



మొగదారలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మునుపెన్నడూ లేని విధంగా ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పెదరామ గ్రామ సచివాలయం పరిధిలో మొగదార, మొగదారగూడ, పెదరామ, సంకిలిగూడ తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. తమ గ్రామాలకు ఎమ్మెల్యే రావడంతో మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ పలకరిస్తూ ముందుకు సాగారు. గిరిజన ప్రాంతాల్లో అందరికీ సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందుతున్నాయన్నారు. అర్హత ఉంటే ఎలాంటి సిఫార్సు లేకుండా దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా పథకాలు వర్తింపజేయాలని అధికారులకు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం రూ.40లక్షలు ఏజెన్సీ ప్రాంతాల్లో మంజూరు చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ

మొగదార జంక్షన్ నుంచి మొగదారగూడ గ్రామానికి రూ.10 లక్షల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సవర లక్కమ్మ ఒంటరి మహిళకు రూ.5 వేలు ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు. మూడో విడతలో మొగదార ప్రాథమిక పాఠశాల నాడు – నేడు పనులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోపువలస జంక్షన్ నుంచి ఈతమానుగూడ రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కమ్యూనిటీ భవనాలు, ఇంటర్నల్ సీసీ రహదారులు, వరదగోడలు, విద్యుత్ స్తంభాలు, రచ్చబండలు వంటివి గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు వెచ్చించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, విజయలక్ష్మి, సర్పంచ్ తిరుపతిరావు, ఎంపీడీఓ కె.సత్యం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్‌కుమార్, పీఆర్ ఏఈ కిరణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

రాష్ట్రంలో జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పలువురు పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ శ్రేణులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికి గురువారం వెళ్లి వివరించారు. జగనన్న స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: తలవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మధుసూదనరావు, సచివాలయ కన్వీనర్లు



భామిని: గజపతినగరంలో సీఎం జగనన్నకు మద్దతు చెబుతున్న గిరిజనులు

సీపీఎం ప్రచార భేరి



మల్లమ్మగూడలో సీపీఎం ప్రచార భేరి

పాలకొండ: సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని మల్లమ్మగూడలో ప్రచార భేరి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు దావాల రమణారావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోని వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని ఆరోపించారు. వ్యవసాయ భూములను అదానీ కంపెనీలకు అప్పజెప్పి ఆహార భద్రత లేకుండా చేస్తుందని ఆరోపించారు. ఉపాధి హమీ పథకానికి నిధులు కోత వేసి పథకం నీరుగార్చే ప్రయత్నాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో దూసి దుర్గారావు, కాద రాము, బాన్ చందర్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రాల సందర్శన



జియ్యమ్మవలస సీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

జియ్యమ్మవలస: మండలంలోని తుంబలి, పెదమేరంగి, గవరమ్మపేటల్లో ఉన్న వెల్‌నెస్ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు గురువారం సందర్శించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, రికార్డులు, ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలించారు. మందుల, పరీక్షల స్టాకు వివరాలు పరిశీలించి ఎప్పటికప్పుడు అవసరమైన వైద్య సదుపాయాన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఉన్నట్లు గుర్తించినా ఆశా కార్యకర్తలు వారిని దగ్గరలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు పంపించాలన్నారు. జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలను పరిశీలించారు. వెనుకబడిన వాటిలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతిరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పాడి గ్రామ సర్పంచ్ సస్మితాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని పాడి పంచాయతీ గ్రామ సర్పంచ్ మూటక సస్మిత భర్త మూటక కుమార్ (35) అనారోగ్యంతో మృతి చెందటంతో విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు గురువారం చీడుమానుగూడ గిరిజన గ్రామానికి వెళ్లి సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి కారణాలను సర్పంచ్ సస్మితాను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. వారి వెంట ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు రాజేశ్వరి, బంగారునాయుడు, కురుపాం గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు ఉన్నారు.

రేషన్ డిపోను తనిఖీ చేసిన పీఓ

సీతంపేట: పొల్ల పంచాయతీ పరిధిలోని నాయకమ్మగూడ రేషన్ డిపోను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని సరుకులు పరిశీలించారు. అక్కడ కందిపప్పు నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని ఎందుకు విక్రయించలేదని సంబంధిత డీలర్‌ను ప్రశ్నించారు. స్టాక్ రికార్డులు కూడా సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి చెందారు. ధరల పట్టిక ప్రదర్శించాలని సూచించారు.



నిల్వలు పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి

కొమరాడ: సచివాలయ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని, ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీఓ ఎల్.వి. అప్పారావు అన్నారు. మండలంలోని కెమిశీల, గుణదతీలేస్ సచివాలయాలను ఆయన గురువారం సందర్శించారు. అనంతరం గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామ వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారు వివరాలు గోడకు అంటించాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పని నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ విస్తరణ అధికారి గోపాల్‌కృష్ణ సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



కెమిశీలలో హాజరు పట్టిక పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

వీఆర్‌ఏల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘ నాయకులు

జియ్యమ్మవలస:

వీఆర్‌ఏలు తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి గురువారం వినతిపత్రం అందజేశారు. చినమేరంగిలోని ఆమె నివాసంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం కలిసి తమ సమస్యలు విన్నవించారు. ముఖ్యమంత్రికి తమ సమస్యలు తీసుకువెళ్లాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బి.దిలీప్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



మెగా వైద్య శిబిరంలో రోగులకు మందులను అందజేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని బీఎస్‌ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. గుండె వ్యాధి నిపుణులు సాయితేజ, జనరల్ మెడిసిన్ వైద్యులు సమీర్ చంద్ర, ఈఎన్‌టీ వైద్యులు బిందు భార్గవి, ఆర్థోపెడిక్ వైద్యులు కౌశిక్, స్త్రీ వైద్య నిపుణులు పల్లవి, అష్టమాలజీ అప్పలకొండ 224 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. వీరిలో 64 మందిని మెరుగైన వైద్యం కోసం జెమ్స్ ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు చేతుల మీదుగా ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ షన్ముఖరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ తదితరులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, దోస్త్ మేరా దోస్త్ సంఘం అధ్యక్షుడు పాలక ప్రేమానంద్, వైస్ సర్పంచ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

కురుపాం: వైఎస్సార్ బీమా తక్షణ సాయం సద్వినియోగం చేసుకోవాలని నీలకంఠాపురం గ్రామ సర్పంచ్ అద్దాకుల మన్మథరావు, కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నిమ్మల వెంకటరావు అన్నారు. నీలకంఠాపురం పంచాయతీ పరిధిలోని మహేంద్రపురం గ్రామానికి చెందిన బిడ్డిక గోపాలరావు మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందటంతో మృతుడి భార్య భారతికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు గురువారం అందజేశారు.



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న నాయకులు

ఉపాధి మార్గాలపై అవగాహన

పాలకొండ రూరల్: యువత భవిష్యత్తు ఉపాధి మార్గాలపై అవగాహన పెంచుకోవాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్ధననాయుడు అన్నారు. కళాశాల ప్రాంగణంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు నూక సన్యాసిరావు నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమం గురువారం చేపట్టారు. కళాశాల దశ నుంచి ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని అందుకు తగ్గట్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకరరావు అన్నారు. విద్యార్థులకు అవసరమైన సహకారం తమ వంతుగా అందిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసిరావు

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

● డీఎస్పీ కృష్ణారావు



డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ కృష్ణారావు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ నెలలో 231 మందిపై మద్యం తాగుతున్న వారిపై, 12 మంది మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమాన విధిస్తున్నామని తెలిపారు. నిబంధనలు పాటించకుండా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



పెద్ద అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం:

మండలంలోని రేగులపాడు సర్పంచ్ మెరుగుల భవానీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం పరామర్శించారు. ఈమె మామగారైన మాజీ సర్పంచ్ మెరుగుల పెద్ద అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలియడంతో ఎమ్మెల్యే కళావతి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పెద్ద అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



జియ్యమ్మవలస: మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

ఎమ్మెల్యే పరామర్శ

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి గ్రామానికి చెందిన వాన అప్పలనర్సమ్మ ఇటీవల మరణించడంతో వారి కుమారుడు వాన నారాయణరావు దంపతులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, మరడాన కిశోర్ తదితరులున్నారు.

ఇళ్లు లేని అర్హుల వివరాలు నమోదు

భామిని:

మండలంలో ఇళ్లు లేని పేదల వివరాలను విధిగా గుర్తించి జాబితాలు సిద్ధం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈఈ ఎల్.ప్రభాకరరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలకు సంబంధించి ఇంజినీరింగ్ సహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం మాట్లాడుతూ ఇంటి స్థలం ఉండి అర్హులైన లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలని అన్నారు. ఇప్పటికే నిర్మాణాలు కొనసాగుతున్న పీఎంఏవై గృహాల నిర్మాణాలను గుర్తించి ఎం బుక్‌లు సిద్ధం చేయాలన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు ఇంటి దరఖాస్తులు విధిగా తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఈ ప్రభాకర్, చిత్రంలో తోట సింహచలం

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

పాలకొండ రూరల్: ప్రజా సమస్యలపై సచివాలయ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని కొండాపురం, సింగన్నవలస గ్రామ సచివాలయాను ఆకస్మికంగా గురువారం సందర్శించారు. ఈ క్రమంలో రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, హాజరుపై ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బట్వాడా, వేసవి నేపథ్యంలో సచివాలయాల పరిధిలో ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కార చర్యలపై సమీక్ష చేపట్టారు. జిల్లాలో కోవిడ్ కేసులు నమోదవుతున్న క్రమంలో ప్రజల ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టాలని, రోజువారీ నివేదికలను సిద్ధం చేయాలన్నారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో సమస్యలను అధిగమించాలని సూచించారు.



కొండాపురం సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

పాలకొండ రూరల్: వారం రోజులుగా కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ క్రమంలో పాలకొండ అగ్నిమాపక కేంద్రం వద్ద ఆ శాఖాధికారి జామి సర్వేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ప్రమాదాలు సంభవిస్తే ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు శాఖాపరంగా తీసుకునే చర్యలు, వినియోగించే పరికరాల పనితీరుపై ప్రజలు, పలు పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక డెమో ద్వారా మెలకువలపై వివరించారు.



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు